# నా ఫాంటసీ

నలభై ఏళ్ళక్రితం, నేను ఉద్యోగంలో చేరిన మొదటిరోజు, నా సీనియర్ బాస్, మళయాళీ, ఒక సలహా ఇచ్చాడు. అతని సలహా – నీ దగ్గర ఎంత డబ్బు ఉందనేది ఎవ్వరికీ తెలియనివ్వకు. నీ దగ్గర బాగా డబ్బుంటే, నిన్ను అప్పు అడగడానికి వస్తారు. నువ్వు కానీ లేని పాపర్ వెధవ్వని తెలుస్తే, నువ్వు అప్పు అడుగుతావేమోనని పారిపోతారు. జీవితం మూసిన పిడికిలిలా ఉంచు. ఎవ్వరికీ, ఏమీ తెలియనివ్వకు.

నేను రిటైరయ్యేదాకా ఈ బంగారు సలహా తూచా తప్పకుండా పాటిస్తూ వచ్చాను. కోటీశ్వరరావు దగ్గర లక్షలు మూలుగుతున్నాయి. లోభి వెధవ, కానీ విదల్చడు, అనే అభిప్రాయానికొచ్చారు బంధుమిత్రులలో ఒక వర్గం. వాడి పేరులోనే కోటి కాని వాడి దగ్గరేముంది? వాడి జీతంలో ఎదుగా? బొదుగా? ఏం నిలవేస్తాడు? అని మరో వర్గం అభిప్రాయ పడ్డారు.

ఇంకోళ్ల జీవితంలోకి తొంగి చూడడం చాలా మందికి హాబీ. "ఏంటి? ఇప్పుడేం జేస్తావు? మళ్ళీ ఎక్కడైనా ఉద్యోగం వెతుక్కుంటున్నావా? ఇల్లు ఏమైనా కడుతున్నావా? నీ పోస్ట్ రిటైర్మెంటు ప్లాన్సు ఏమిటి?" అని రకరకాలుగా ప్రశ్నించి, నా స్థితిని అంచనా వేద్దామని ఆశించిన హాబీగాళ్లకు నిరాశే మిగిలింది. నేను మూసిన పిడికిలి విప్పకుండా చిరునవ్వో, చిరాకో, సమాధానంగా వదిలాను.

ఎవ్వరి దగ్గర పిడికిలి విప్పకపోయినా, అర్ధాంగి దగ్గర ఆర్థిక వ్యవహారాలు చెప్పక తప్పదు కదా! అందుచేత మా ఆవిడ చెవిలో రహస్యంగా అంతా చెప్పాను. మా ఆవిడకు నేను డబ్బు వ్యవహారాలు సరిగా చూడగలను అనే నమ్మకం లేదు. అందుచేత ఆవిడ వెంటనే డబ్బిగాడికి ఫోన్ చేసి రమ్మంది.

డబ్బిగాడంటే నా బావమరిది. నాకంటే పాతికేళ్ళు చిన్న. బ్యాంకులో పని చేస్తున్నాడు. వాడు పెద్ద ఆర్థిక నిపుణుడు అని మా ఆవిడ అభిప్రాయం. వాడి జీతం పదిహేను వేలకి మించదు. కాని వాడి లైఫ్ స్టయిల్ మాత్రం ప్రిన్స్ ముఖరమ్ జా లైఫ్ స్టయిలే. రెండంతస్తుల ఇల్లు- హాలులో, రెండు బెడ్రూంలలోనూ ఏసీలు, ఇంటి ముందు గూర్ఖా, కారు....

"వీడు బ్యాంకులో పనిచేస్తున్నాడా? బ్యాంకు దోచేస్తున్నాడా?" అన్నాను అనుమానంగా, వాడి స్టయిలు చూసి.

"ఛ... ఏమిటా మాటలు? వాడు కష్టపడుతున్నాడు- రాజాలా అనుభవిస్తున్నాడు" అంది మా ఆవిడ, తమ్ముడిని వెనకేసుకొస్తూ.....

కీ.శే. టి.కె. రాఘవరావుగారు - అంటే మా మావగారు- కూడా జీవితంలో చాలా కష్టపడ్డారు. ఆయన సర్వీసులో ఎప్పుడూ కుర్చీలో కూర్చుని పనిచెయ్యలేదని అందరూ అనేవారు. ఆయన టేబులు కింద నుంచే వ్యవహారాలు నడిపేవారు. అందుకని, ఆయన్ని టేబులకింద (టి.కె.) రాఘవరావుగారు అని అందరూ అంటుండే వారు. ఒక రోజు ఆయన అలవాటుగా టేబులు కింద చెయ్యి పెడితే, సిబిఐ వారు ఆ చెయ్యి గట్టిగా పట్టుకున్నారు. వెయ్యి గొడ్లను తిన్న రాబందు ఒక్క గాలివానతో సరి అన్నట్లు, ఆయన సంపాదించిన దాంట్లో మూడొంతులు పైగా ఈ కేసులో ఎగిరిపోయింది. పోలీసులు, లాయర్లు, పై ఆఫీసర్లు మా మావగారిని తినేశారు. ఆ తర్వాత మా మావగారికి ఈ జగమంతా మిథ్య అనిపించి వైరాగ్యంలోకి దిగిపోయారు. మా అత్తగారు లోకంలో ఎక్కడా న్యాయం లేదు అన్న నిర్ణయానికి వచ్చేశారు. కీ.శే. మామగారి గురించి ఎందుకు చెపుతున్నానంటే, డబ్బిగాడిది మావగారి పోలిక.

"డబ్బిగాడు కూడా మీ నాన్నలాగే కష్టపడుతున్నాడేమోనని నా డౌటు" అన్నాను మా ఆవిడతో.

"ఎప్పుడో ఇరవై ఏళ్ల క్రితం పోయిన ఆయన్ని అనడం దేనికి? మీ నోటి నుంచి ఒక్క మాటా సవ్యంగా రాదు? నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది. అందరితోనూ దెబ్బలాటే - మీతోటి వాళ్లందరూ, డిపో మేనేజర్‌గా చేరి రీజనల్ మేనేజర్లు, డైరెక్టర్లు అయ్యారు. డిపో మేనేజర్‌గా చేరి, నలభై సంవత్సరాలు సర్వీసు చేసి, డిపో మేనేజర్‌గా రిటైరయిన ఘనత తమరొక్కరికే దక్కుతుంది. గిన్నీస్ బుక్‌లోకి ఎక్కించాలి మీ పేరు" అని కౌంటర్ ఎటాక్కిచ్చింది మా ఆవిడ.

"కోటేశ్వర్రావు చంచాగిరి చెయ్యడు. పులి - ఉన్న మాట మొహంమీదే అనేస్తాడు."

"పులి ముసలి పులి అయింది కదా...."

"ఏమిటి బావా? అక్క నిన్ను పులి అంటోంది?" అంటూ రంగంలోకి దిగాడు డబ్బిగాడు. అక్కగారి ఫోనందగానే చక్రాలు కట్టుకుని - అంటే వాడి కారులో వచ్చి వాలాడు.

"ఒరే డబ్బీ - ఒక్కమాట నిజం చెపుతావా?"

"అడుగు బావా"

"నీకు ముసలి పులి అని వినిపించిందా? పులి అని వినిపించిందా?"

"ముసలి పులి అని వినిపించిందనుకో - ఆ మాటంటే నువ్వు బాధపడతావని పులి అన్నాను."

"బతక నేర్చినవాడి మాటలే ఇవి- ఈ లౌక్యం లేకే నేను లైఫ్‌లో దెబ్బతిన్నానురా డబ్బీ...."

"వాడిని అలా అబ్బీ, డబ్బీ అని పిలవకండి. బాగోదు. వాడేమన్నా చిన్నపిల్లాడా? పేరు పెట్టి పిలవండి" అని మందలించింది మా ఆవిడ.

"వీడిని అబ్బీ, డబ్బీ అని పిలవడమే కాని వీడి అసలు పేరు మరిచిపోయాను. నీ పేరేంట్రా డబ్బీ?"

"రామకృష్ణ" అన్నాడు డబ్బిగాడు. 'పోన్లేవే, బావ అభిమానంగా అలా డబ్బీ అంటేనే నాకు బావుంటుంది.'

వాడి లౌక్యం గురించి అంచనా వేసినా, వాడిని పూర్తిగా అర్థం చేసుకోలేదు నేను. దొంగనక్కలా వాడు, వాడి వినయంతో, టక్కరితనంతో నన్ను గోతిలో దింపాడని, గోతిలో పడ్డాకే నాకు తెలిసింది కానీ అప్పుడు రవంత కూడా అనుమానం రాలేదు.

అవీ ఇవీ మాట్లాడాక అసలు విషయంలోకి వచ్చింది మా ఆవిడ.

"డబ్బీ- మీ బావకు ఏమీ తెలియదు. నీకు తెలుసు కదా. మాకు పెన్షన్ రాదు. ఈ రిటైర్మెంటు డబ్బు జాగ్రత్తగా దాచుకోకపోతే ముందు జీవితం గడిచే తీరు లేదు. ఈయనేమో నా మాట వినరు. ఆ డబ్బు తీసుకెళ్ళి ఫిక్సెడ్ డిపాజిట్లలో పడేస్తానంటారు. బ్యాంకు వడ్డీ ఎంతొస్తుంది?"

"గాడిద గుడ్డొస్తుంది" అన్నాడు బ్యాంకింగ్ ఎక్స్‌పర్ట్.

"అదే నేనూ చెప్పేది. వీళ్ల బామ్మగారు బియ్యం డబ్బాల్లోనూ, పోపుల పెట్టెలోనూ డబ్బులు దాచేవారట. ఆవిడ ఈయనకి తిరునాళ్లకోసం కానీ, అర్ధణా ఇస్తే ఈయన ఖర్చు పెట్టకుండా జాగ్రత్తగా మట్టిపిడతల్లో దాచేవారుట...."

"బావకి మట్టిపిడతల మెంటాలిటీ పోలేదు ఇంకా, అందుకే పోస్టాఫీసు, బ్యాంకు అంటున్నాడు. బయట ధరలు ఎలా మండిపోతున్నాయో చూశావా బావా? నీ ఖర్చు పదిరూపాయలు పెరిగితే, నీకు వడ్డీ ఆరు రూపాయలొస్తోంది. పొదుపు పథకాలలో లాభం వస్తోందా? నష్టం వస్తోందా?"

"తిరుక్షవరమవుతోంది."

"గుడ్-నీ బుర్ర సరిగ్గానే పనిచేస్తోంది. కాలం మారింది. ఇప్పుడు జనం డబ్బు ఖర్చయినా పెట్టాలి. లేకపోతే స్టాక్ మార్కెట్లో నయినా పెట్టాలి. కాని పిడతల్లో దాచుకోకూడదు అనీ గవర్నమెంటు ఆలోచిస్తోంది. అందుకే సొమ్ము స్టాక్ మార్కెట్లోకి మళ్లించడానికి ఆర్థికమంత్రిగారు చర్యలు తీసుకుంటున్నారు."

"ఆర్థిక మంత్రా? వాడు నెంబర్ వన్ పిక్‌పాకెట్- కార్పొరేట్ దొంగల ముఠా నాయకుడు.... ముగాంబో....".

"ఇదిరా డబ్బీ ఈయన వరస-ఈ ప్రపంచంలో ఈయన తప్ప అందరూ దొంగలే. ఆర్థిక మంత్రి ముగాంబో- హోంమంత్రి జింబో...."

"జింబో కాదు. జింబో అడవి మనిషి. చాలా మంచివాడు. హోం మంత్రి గబ్బర్‌సింగ్. ఆర్థిక మంత్రి జేబులు కొడుతుంటే, వీడు 'హ్యాండ్సప్' అని జనం కిక్కురుమనకుండా తుపాకీ పట్టుకుని నిలబడతాడు..."

"బావా, అందరినీ అలా తిట్టి ప్రయోజనం లేదు. కాలంతో పాటు నువ్వూ మారాలి. బ్యాంకు డిపాజిట్లలో వచ్చే వడ్డీ పంటికిందకు రాదు."

"అవునురా డబ్బీ-పన్నంటే గుర్తొచ్చింది-మొన్న పంటినొప్పి అని చెప్పి వీనస్ హాస్పిటల్‌కి వెడితే పళ్లూడగొట్టి పదివేలు దోచేశారు."

"అదే నేనూ చెప్పేది. మనం కూడా స్మార్టుగా ఉండాలి. అదే నువ్వు వీనస్ హాస్పిటల్‌లో షేర్ కొంటే ఎంత లాభం వచ్చేదో ఆలోచించు" డబ్బిగాడు నచ్చచెప్పాడు. "మనం ఎద్దుబండి వదిలేసి కార్లలోనూ, రైళ్లలోనూ, విమానాలలోనూ వెడుతున్నామా లేదా? అలాగే నువ్వు మట్టి పిడతలు, బ్యాంక్ డిపాజిట్లు వదిలేసి స్టాక్ మార్కెట్లోకి

దిగాలి. ఎంతలేదన్నా సంవత్సరానికి 25 శాతం లాభం వస్తుంది. నీ దశ బాగుంటే ఏడాదిలో డబులైపోవచ్చు."

అంత లాభం అనగానే మా ఆవిడ కళ్లు మిలమిల మెరిశాయి.

నేను మాత్రం, "మనకి స్టాక్ మార్కెట్ తెలియదురా డబ్బీ, అదొక మాయాలోకంలాగుంటుంది" అన్నాను.

"నీకేం ఫరవాలేదు. నీ వెనకాల నేనుంటాగా..."

"వద్దురా డబ్బీ-లోతు తెలియనిచోట దిగొద్దనేది మా బామ్మ. నేను దిగను."

"మీ వెనకాల వాడుంటానంటున్నాడు కదా..."

అదే నా భయం కాని డబ్బిగాడి గురించి నాకున్న అనుమానాలు సూటిగా, కుండబద్దలు కొట్టినట్లు చెప్పలేక, "నేను దిగను - నాకు ఈ గొడవలు ఏవీ తెలియవు" అన్నాను మళ్లీ.

"పోనీ బావా- ఇంకో పని చెయ్యి - నువ్వు బ్యాంకు డిపాజిట్టనుకొని నా దగ్గర పెట్టు - బలవంతం లేదు. నీ కిష్టమైతేనే. నేను నీకు సంవత్సరానికి 20 శాతం వడ్డీ ఇస్తాను. లాభం వచ్చినా, నష్టం వచ్చినా నాదే, వడ్డీ మాత్రం నీకు నెల నెలా పెన్షన్‌లా ఇచ్చేస్తూ ఉంటాను. సరా?"

డబ్బిగాడు బోనులో ఎరపెట్టి తలుపు ఓరగా తెరిచాడు. వాడి వెనకాల కీ.శే. రాఘవరావుగారి రూపం లీలగా కనిపించింది. ఆయన కనిపించడంతో నేను అదిరిపడి 'వద్దురా డబ్బీ' అన్నాను ఖచ్చితంగా.

'జగమొండి-ఈయనతో నేను కాబట్టి ఇన్నేళ్లు కాపురం చేశాను. కాని ఇదే ఇంకోత్తయితే పెళ్లయిన వెంటనే వదిలేసేది'- మా ఆవిడకు చాలా కోపం వచ్చింది- "లాభమైనా, నష్టమైనా నాదే అని వాడు అంతలా అంటుంటే, ఏమిటో మొండిపట్టుదల? వాడిమీద నమ్మకం లేదా?"

'వాడి మీద కాదు - నాకు డబ్బుమీద నమ్మకం లేదు - డబ్బా డబ్బా, ఏం చేస్తావే అంటే అమ్మకీ, అబ్బకు కాకుండా చేస్తానంటుందట డబ్బు- మా బామ్మ చెబుతుండేది....'

'మనిషికి తన బాగు తెలియదు. ఇంకోళ్ళు చెబితే వినే అలవాటు లేదు. ఎప్పుడో చచ్చిపోయిన బామ్మగారి మాట తప్ప - నా ఖర్మ.'

'పోనీలేవే. అక్కా, బావ అని అన్నాను కాని, నా దగ్గర అంత టైమెక్కడుంది? బావ కోసం వేస్ట్‌చేసే టైంలో నేను చలాగ్గా నాలుగైదు లక్షలు సంపాదించుకుంటాను' నిమిషాలు, గంటలు బ్యాంకులో క్యాష్ చేసుకునేవాడిలా అన్నాడు డబ్బిగాడు.

"ఏమి తోస్తే అది చేసెయ్యడమే కాని మంచికీ, చెడుకీ పెళ్లాన్ని సలహా అడిగే అలవాటు ఈయనకు మొదటి నుంచీ లేదు. తగలెయ్యండి... మీరు సంపాదించిన డబ్బు... మీ ఇష్టం వచ్చినట్లుగా తగలెయ్యండి... అడగడానికి నేనెవర్ని?" అంటూ మొదలుపెట్టింది.

నా ఇష్టమొచ్చినట్లు తగలేస్తాను అని మొండిగా అన్నా చివరకు గెలుపు మా ఆవిడదే అయింది. డబ్బిగాడు నా దగ్గర్నుంచి చెక్కుతీసుకొని వెళ్లిపోయాడు.

డబ్బిగాడు వెళ్లాడో లేదో శర్మ దొంగపిల్లిలా మెల్లిగా వచ్చాడు. శర్మ నా చిన్ననాటి స్నేహితుడు. పొరుగునే ఉంటాడు. నాకంటే రెండేళ్ళు పెద్ద. రెండేళ్ల క్రితమే రిటైరయ్యాడు. వాడికి కూడా నేను పైన చెప్పిన హాబీ వుంది. రిటైరయ్యాక మరి పనీ పాటా లేదు. ఎవరింట్లో ఏం జరిగినా వాడికి కొన్ని రోజుల పాటు కాలక్షేపానికి గ్రాసం దొరుకుతుంది.

"ఏమిటీ? మీ బావమరిది వచ్చివెళ్లినట్లున్నాడు?" అనడిగాడు.

'ఆ! వచ్చాడు, వెళ్ళాడు' అన్నాను ముక్తసరిగా.

'రిటైర్మెంట్ డబ్బు ఎక్కడ పెట్టాలో సలహా ఏవైనా ఇచ్చాడా?'

అసలే ఇంట్లో గొడవతో ఒళ్లు మండిపోతున్న నాకు కారం రాసినట్టయింది.

"ఆc! గోదాట్లో పడెయ్యమన్నాడు" అన్నాను చిరాకుగా.

"నువ్వేమన్నావు?" నా చికాకు పట్టించుకోనట్లు అడిగాడు శర్మ.

"అనేదేముంది? గోదాట్లో పడేస్తాను"

"పైన తథాస్తు దేవతలు తథాస్తు అంటారు. కింద బ్రాహ్మణ దేవతని నేను కూడా తథాస్తు అంటే నీ సొమ్ము నిజంగా గోదారిపాలే...."

"అట్టే మాట్లాడావంటే తంతా – ఫో" అని కసిరాను.

"నీకు తలతిక్క. అందుకే నీకు ఒక్క స్నేహితుడు కూడా లేదు" అంటూ వెళ్లిపోయాడు శర్మ.

మా బావమరిది నెలరోజుల తర్వాత ఒకటో తారీఖున హడావుడిగా వచ్చేశాడు. 'అక్కా ఇంట్లో పూలేమైనా వున్నాయా?'

అక్కగారు సమాధానం చెప్పేలోగా పెరట్లోంచి మల్లెలు, గులాబీలు, చామంతులు కోసుకొచ్చి ప్లేట్లో సర్ది, ఆ ప్లేట్లో నెలవడ్డీ రొక్కం పెట్టి – 'బావకివ్వాల్సింది పువ్వుల్లో పెట్టి ఇస్తున్నానే' అంటూ ప్లేటు అందించాడు. మా ఆవిడ మొహం చింకిచాటంతయింది. వాడి సెన్సు ఆఫ్ హ్యూమర్‌కి నేనూ సంతోషించాను. వెర్రి వెధవని అపార్థం చేసుకోలేదు కదా అని రవంత పశ్చాత్తాపం కూడా కలిగింది.

రెండో నెల పువ్వుల్లో పెట్టి కాకపోయినా చేతికిచ్చాడు. మూడో నెల ఏదో ఇబ్బంది వుందని సగమే ఇచ్చాడు. నాలుగో నెల రాలేదు. నేను ఫోన్ చేస్తే పనిమీద ఒకసారి హైదరాబాద్, మరోసారి బొంబాయి వెళ్లాడని మా అత్తగారు ఒకసారి, వాడి పెళ్ళాం ఒకసారి చెప్పారు. అయిదో నెల నుంచి వాడు మాయమైపోయాడు. ఫోన్ చేస్తే సరైన సమాధానం రాలేదు.

"ఏమిటి? మీ బావమరిది వస్తున్నట్లు లేదు" శర్మ మెల్లగా అడిగాడు.

"వాడేదో పని మీద బిజీగా వున్నాడు"

"పనా? గాడిదగుడ్డా? నీ సొమ్ము గోదారిపాలే...."

వెధవ దగ్గర నోరుమెదపకపోయినా, అంతా కూపీలాగాడన్నమాట.

"నా సొమ్ము గోదారి పాలవడమేమిటి?"

"నాకు అంతా తెలుసు నాయనా-వెర్రిమొహంలా నువ్వు వాడికి సొమ్ము ఇచ్చావు. బావా, బావా అంటూ వాడు నీకు కుచ్చులటోపీ పెట్టాడు. ఇంక నీ సొమ్ముకి నీళ్లొదులుకో...."

"బావామరుదుల మధ్య కలహాలు పెట్టాలని చూస్తే బుర్ర బద్దలు కొట్టేస్తాను – వాడేదో ఇబ్బందుల్లో వుండి రాలేకపోయాడు. అంతే"

"ఓరి పిచ్చిమొహమా – నీ బావమరిది నీకే కాదు, నాకూ మూడు లక్షలకి టోపీ వేశాడు. రెండేళ్లయింది – కానీ ఇవ్వలేదు– మీవాడు ఈ మధ్య టోపీల బిజినెస్ మొదలుపెట్టాడు. రిటైరయిన వాళ్లకి వడ్డీ ఆశ చూపించి చాలామందికి టోపీ వేశాడులే."

"దొంగమొహమా– నీకు అంతా తెలిస్తే నాకు ముందే ఎందుకు చెప్పలేదు?"

"బావామరుదుల మధ్య కలహాలు పెట్టాలని చూస్తున్నానని నా బుర్ర బద్దలు కొట్టేస్తావని" నా మాట నాకే అప్పజెప్పాడు శర్మ. వాడి వాలకం చూస్తే వాడి డబ్బు పోయినందుకు బాధ కంటే, నా డబ్బు కూడా పోయినందుకే సంతోషిస్తున్నట్లుగా కనిపించింది.

"అయినా నీకేం ఫరవాలేదులే – అక్కగారు, బావగారు కదా– ఇవ్వాళ కాకపోతే రేపైనా, పూర్తిగా కాకపోతే సగమైనా, ఇస్తాడు. నన్నే నిలువునా ముంచేశాడు నీ బావమరిది."

"నువ్వేమిటి? నేనేమిటి? తప్పు చేసినవాడి డొక్క చించేయాలి. పద... వెధవని నిలదీసి ఆడుగుదాం." అన్నాను ఆవేశంగా.

"తీరా అక్కడికి వెళ్లాక మీ బావమరిదితో రాజీపడిపోయి నన్ను ముంచెయ్యకూడదు".

"కోటేశ్వర్రావు మాటంటే మాటే– దొంగ వెధవలతో చేతులు కలపడు. పద..."

డబ్బిగాడింటికి గృహప్రవేశానికి వెళ్లాను కాని, మళ్లీ ఎప్పుడూ వెళ్లలేదు. గేటు దగ్గర గూర్ఖావాడు ఆపు చేశాడు. నా బంధుత్వం తెలియజేసిన తర్వాత, ఫోనులో మాట్లాడి, నాకు సెల్యూట్ చేసి లోపలకు పంపించేశాడు. ముందు పాలరాయి పరిపించిన విశాలమైన హాలుంది. ఆ హాలులో నిలువెత్తు కీ.శే. మామగారి ఫోటో కుడిచెయ్యి పైకెత్తి హాల్లో కూర్చున్నవారిని ఆశీర్వదిస్తున్నట్లుంది.

హాలులో పదిహేను, ఇరవై మంది కూర్చునేందుకు వీలుగా పెద్ద సోఫా సెట్టుంది. మేం హాల్లో ప్రవేశించేటప్పటికి, అక్కడ నలుగురైదుగురు వచ్చి వాడి కోసం వెయిట్ చేస్తున్నారు. మరో మూల ఒక ముసలాయన బిక్కు బిక్కుమంటూ బెదురు చూపులు చూస్తూ కూర్చుని వున్నాడు. ఆయన పక్కన సోఫాలో నేనూ, శర్మ కూలబడ్డాం. విశాల, అంటే డబ్బిగాడి పెళ్లాం, 'బావున్నారా అన్నయ్యగారూ' అంటూ మంచినీళ్లందించి వెళ్లిపోయింది. అయిదు నిమిషాల తర్వాత మా అత్తగారు వచ్చి 'బావున్నావా నాయనా' అని పలకరించి, 'అబ్బాయి పూజలో వున్నాడు వస్తాడు' అని చెప్పి, హాలులో ఓ మూల చతికిపడి, రామాయణమో, భాగవతమో పారాయణ మొదలుపెట్టింది. ఆ వాతావరణం చూస్తే నాకు మా బావమరిది ఇంటికి వచ్చినట్లు లేదు. ఏదో మంత్రిగారినో, ఎంపిగారినో కలవడానికి వెళ్లి, రిసెప్షన్లో కూర్చుంటే ఎలా వుంటుందో అలా వుంది.

హాలులో వాళ్లు మెల్లిగా గుసగుసలాడుతూ మాట్లాడుకుంటుంటే డబ్బిగాడు ప్రత్యక్షమయ్యాడు. పట్టు లుంగీ, పైన పట్టు అంగవస్త్రం, మెళ్లో నవరత్నమాల, నుదుట కుంకుమ బొట్టు, జబ్బలకు విబూధి రేఖలు, హాల్లో వారందరినీ కలియజూసి, స్వామీజీలా కుడిచెయ్యి పైకెత్తి, ఈ మూలనుంచి ఆ మూలకు నూటయెనభై డిగ్రీల యాంగిల్ లో విష్ చేస్తున్నట్లుగా తిప్పాడు. వాడి చెయ్యి తమ వైపుకు తిరిగినప్పుడు

కూర్చున్న వాళ్లు కొద్దిగా లేచి విష్ చేశారు. వాడి చూపు మొదటి కుర్చీలో బ్రీఫ్‌కేస్ పట్టుకు కూర్చున్నాయన మీద నిలిచింది. ఆయన దగ్గరకువెళ్ళి నవ్వుతూ మెల్లగా ఏదో అరనిమిషం మాట్లాడి, ఇంకెవ్వరికేసి చూడకుండా తిన్నగా నా దగ్గరకు వచ్చి, 'ఇప్పుడే వస్తాను బావా' అని వెళ్లిపోయాడు.

డబ్బిగాడు వెళ్లిపోయిన తర్వాత విశాల వచ్చి, బ్రీఫ్‌కేస్ పెద్దమనిషిని చిరునవ్వుతో పలకరించి రెండు నిమిషాలు మాట్లాడింది. పనివాడు ట్రేలో ఫ్రూట్‌జ్యూస్ గ్లాసు తీసుకొచ్చి, ఆయనకు వినయంగా అందించి, పక్కన చేతులు కట్టుకు నిలబడి, ఆయన తాగిన తర్వాత ఖాళీ గ్లాసు పట్టుకుని వెళ్లిపోయాడు. పావుగంట తర్వాత డబ్బిగాడు పై చొక్కా వేసుకు వచ్చి తిన్నగా బ్రీఫ్‌కేసు పెద్దమనిషి ఎదురుగా ఒక స్టూలు లాక్కుని కూర్చుని, ఆయనతో మెల్లగా మాట్లాడడం మొదలు పెట్టాడు.

అప్పటికి నేనొచ్చి గంటయింది. ఫ్రూట్‌జ్యూస్ కాదు కదా, మళ్లీ మంచినీళ్లు అడిగిన వారు లేరు. ఈ వ్యవహారం అంతా చూసి నా ఒళ్లు భగ్గుమంది.

"ఒరే డబ్బీ..." బాంబులా పేలాను. డబ్బిగాడు ఉలిక్కిపడి తలెత్తాడు. అత్తగారు తలెత్తి నోరు తెరిచింది. లోపల నుంచి విశాల, పనివాడు పరిగెట్టుకొచ్చి ఏదో గొప్ప అపరాధం జరిగినట్లు, దిగాలు పడిపోయారు.

"ఒరే డబ్బీ... నేను వచ్చి గంట సేపయింది. నువ్వు నాకు వడ్డీ ఇచ్చి నాలుగు నెలలైంది. ఫోన్ చేస్తే పలకవు. ఇంటికొస్తే సరిగా మాట్లాడవు. ఈ శర్మ రిటైరయ్యాక వచ్చిందంతా వడ్డీకి ఆశపడి నీ చేతుల్లో పెడితే, సంవత్సరం నుంచి వాడికి వడ్డీ ఇవ్వవు, అసలూ ఇవ్వవు. ఏమిటిరా నీ ఉద్దేశ్యం?"

హాలంతా నిశ్శబ్దమై పోయింది. డబ్బిగాడితో మాట్లాడుతున్నాయన, గమ్మున లేచి బ్రీఫ్‌కేస్ తీసుకొని డబ్బిగాడు ఏదో చెపుతున్నా వినిపించుకోకుండా వెళ్లిపోయాడు. ఆయన వెళ్లిపోగానే హాల్లో కూర్చున్న ముగ్గురూ ఒకళ్ల మొహాలు ఒకళ్లు చూసుకొని, లేచి డబ్బిగాడికి నమస్కరించి, వెళ్లిపోయారు. మా పక్కన కూర్చున్న ముసలాయన ఏం చెయ్యాలో తోచనివాడిలా కాసేపు చేతులు నలిపి, లేచి, ఎవరికేసి చూడకుండా 'మళ్లీ వస్తా' అని సణిగి వెళ్లిపోయాడు. ఇంక నేనూ, శర్మా మిగిలి పోయాం.

డబ్బిగాడు మా వైపు వచ్చి నన్ను దాటి శర్మ ఎదురుగా నిలబడి, 'పెద్దమనిషి ఇంటి మీద పడి ఇలా అమర్యాదగా మాట్లాడడం ఏమన్నా బావుందా?' అన్నాడు.

'నువ్వు పెద్దమనిషివా?' అన్నాను నేను కలగజేసుకుంటూ...

'బావా – ప్లీజ్– నీతో తర్వాత మాట్లాడతాను' అంటూ నన్ను వారించి, శర్మకేసి తిరిగి, 'మీగోలతో నాకు అప్పు ఇవ్వడానికి వచ్చిన పెద్ద మనుషులు వెళ్లిపోయారు. నాకు నాలుగు లక్షలు నష్టం వచ్చింది. ఆ నష్టం మీరు పూడుస్తారా? నాకు వీలున్నప్పుడల్లా ఇస్తానని చెప్పినా మీరు ఇల్లా చెయ్యడం ఏమన్నా మర్యాదగా వుందా? సరే, నేను మీకు రాసిచ్చిన ప్రామిసరీ నోట్లున్నాయి కదా – కోర్టుకి వెళ్లండి' అన్నాడు కటువుగా.

డబ్బిగాడు అలా ఎదురెట్టి చదరంగం ఆడడంతో ఏం మాట్లాడాలో తెలియక శర్మ తెల్లమొహం వేశాడు.

'కోర్టుకి వెళితే ఏమవుతుందో తెలుసా?' శర్మ తెల్లమొహం వెయ్యడం చూసి డబ్బిగాడే వివరించాడు. 'కేసు పది పదిహేను సంవత్సరాలు సాగుతుంది. మీరు వయసులో పెద్దవారు, కేసు తేలేటప్పటికి బహుశా మీరుండరు. ఒకవేళ మీరు కేసు గెలిచినా, మీకొచ్చేదెంతో తెలుసా? ఈ ఇల్లు మా అమ్మ పేరున వుంది. నా పేరున ఏ ఆస్తిపాస్తులు లేవు జీతం తప్ప. అప్పు యాభై లక్షలకు పైగానే వుంది. నేను ఇన్సాల్వెంటు అయితే మీకు రూపాయికి పైసా కూడా రాదు. వెళ్ళండి కోర్టుకు వెళ్ళండి కాని ఇంక నా దగ్గరకు రావద్దు.'

'రామకృష్ణగారూ – తమరు అలా కోపగిస్తే ఎలా – వృద్ధులం – మీరిచ్చే డబ్బు తప్ప మాకు ఆధారం లేదు. రోజు గడవాలి కదా. మీ బావగారు మీతో మాట్లాడి సొమ్ము ఇప్పిస్తారన్నారని వచ్చాను. కాని తగాదా పడడానికి వచ్చానా?' అంటూ ప్లేటు తిప్పాడు శర్మ.

'మా బావతో నేను తర్వాత మాట్లాడుతాను కాని మీరు వెళ్లండి.'

'తర్వాత కాదు – ఇక్కడే, ఇప్పుడే శర్మ ఎదురుగానే మాట్లాడతాను. శర్మా, మావాడు చెప్పింది నిజం. కోర్టుకి వెళితే నీకు కానీ రాదు. కొడుకుల మీద ఆధారపడకుండా నీ చివరి రోజులు సుఖంగా గడిచిపోయే మార్గం ఒకటి చెబుతా విను. మనిద్దరం ఈ వెధవ బుర్ర బద్దలు కొట్టేసి రాజమండ్రి సెంట్రల్ జైలుకు వెళ్లిపోదాం. అక్కడ ఫ్రీ బోర్డింగ్, లాడ్జింగ్...'

'చాల్లే... నీ మాట విని ఇంతవరకూ తెచ్చుకున్నాను. ఏమనుకోకండి రామకృష్ణగారూ.... మీకు వీలున్నప్పుడే ఇద్దురుగాని' అంటూ శర్మ వెళ్లిపోయాడు.

ఆ తర్వాత నాటకం చరమాంకం చేరుకుంది.

విశాల- "ఏమండీ... అన్నయ్యగారు అన్నంత పనీ చేస్తారు. మీరు ముందు లోపలికి వచ్చేయండి" అంటూ హడావుడిగా డబ్బిగాడిని లోపలకి లాక్కుపోయి తలుపేసేసింది. మా అత్తగారు 'ఇతను మొదటి నుంచీ ఇంతే- ఇతని సంగతి తెలియక పిల్లదాని గొంతు కోశాం' అంటూ రాగాలు పెట్టింది (పిల్లది అంటే యాభై ఆరేళ్ల మా ఆవిడ. గొంతు కొయ్యడం అంటే ముప్ఫయి నాలుగేళ్ల క్రితం నాకిచ్చి పెళ్లిచేయడం).

"ఆయనలాగానే వాడు అమాయకుడు" గోడ మీది పతిదేవులకేసి చూపిస్తూ అంది అత్తగారు. 'వ్యాపారంలో దెబ్బతిని మాట నిలుపుకోలేక పోయాడు కాని నలుగురికీ ఏదో సహాయం చేద్దామన్న తాపత్రయం తప్ప ఏవీ తెలియదు పిచ్చి మొహానికి. ఈ రోజు నలుగురి చేతా మాటలు పడాల్సి వస్తోంది. లోకంలో ఎక్కడా న్యాయం లేదు' అంటూ 1979 నాటి యల్పీ రికార్డు మళ్లీ వేసి, 'నాదేముంది నాయనా... కాటికి కాళ్లు చాపిన దాన్ని - ఇవ్వాళో, రేపో అన్నట్లున్నాను. ఇల్లమ్మేసి మీ డబ్బు మీకిస్తాను. శ్మశానం దగ్గర చాపేసుకు పడుకున్నా నా రోజు వెళ్లిపోతుంది. రోజు వెళ్లనప్పుడు ఒక కాలు అటు జరిపితేసరి...' అంటూ కుళాయి విప్పింది.

అసలు విషయం అల్లా సైడ్ ట్రాక్ అయిపోయి నేను విలను, డబ్బిగాడు బాధితుడు అయిపోయాం. అత్తగారు ఏడుపులో ఓ క్షణం విరామం ఇచ్చి 'భోంచేసి వెళ్లు నాయనా' అంది అల్లుడికివ్వాల్సిన మర్యాద చూపిస్తూ....

నేను దొంగ వేషాలేస్తే గ్యారంటీగా బుర్రబద్దలు కొట్టేస్తానసీ, కొంపకు అగ్గిపెట్టేస్తానసీ, డబ్బిగాడికి ఇంకో వార్నింగ్ ఇచ్చి బయటకు నడిచాను.

వీధి చివరలో శర్మా, ముసిలాయన ఎదురయ్యారు.

"నీ గురించి నేను మా బావమరిదితో పోట్లాటకు దిగితే, వాడికి క్షమార్పణలు చెప్పి వచ్చేస్తావా? నీ నక్క బుద్ధి పోనిచ్చుకున్నావు కాదు?" అన్నాను శర్మతో.

"ఆయన చాలా కోపంగా వున్నారా?" ముసిలాయన భయం భయంగా అడిగాడు.

"ఈ మాష్టారు పాపం మీ బావమరిదికి రెండు లక్షలిచ్చారుట. ఆయన కూతురు పెళ్లి చెయ్యాలట. ముహూర్తం పెట్టుకోండి, డబ్బు ఇస్తానంటాడుట రామకృష్ణ. డబ్బు చేతిలో లేకుండా ముహూర్తం ఎలా పెట్టుకోను అంటున్నాడు ఈయన. కూతురి పెళ్లిగురించి చాలా బెంగపెట్టుకున్నారు. సొమ్ము అడుగుదామని వచ్చి రామకృష్ణ మూడ్ బాగాలేదని వెళ్లిపోతున్నారు" అన్నాడు శర్మ.

నా గుండె మళ్లీ భగ్గుమంది. “అందరినీ ముంచేసి, వాడు ఏసి ఇళ్లల్లోనూ, ఏసీ కార్లలోనూ తిరుగుతాడా? పదండి వెధవ బుర్ర బద్దలు కొట్టేద్దాం” అన్నాను మళ్లీ.

“నాయనా మా ఏడుపు మేమే ఏడుస్తాం కాని బుర్రలు బద్దలు కొట్టే కార్యక్రమం పెట్టకు. జైల్లో చావలేం.”

“అయితే బయటే చావు.”

నేను ఇంటికి చేరేసరికి మా ఆవిడ వీధి గుమ్మంలో ఆందోళనగా ఎదురుచూస్తోంది. మా అత్తగారు, బావమరిది చిలవలు, పలవలు కల్పించి ఫోనులో అంతా చెప్పేసుంటారు. నేను ఇంట్లోకి అడుగు పెట్టగానే భగ్గుమంది. “అక్కడ అందరినీ చంపేస్తానన్నారుట కదా – ఇల్లు తగలబెట్టేస్తానన్నారుట కదా – వాడు పాపం ఏదో ఇబ్బందుల్లో ఉండి నాలుగైదు నెలలు డబ్బు ఇవ్వకపోతే, ఊళ్లో వాళ్లందరినీ రెచ్చగొట్టి వాడి మీద పడతారా? వాడు చాలా బాధపడ్డాడు. ఇప్పటికిప్పుడే ఇల్లమ్మేసి మన డబ్బు మనకిచ్చేస్తానని మా అమ్మ ఏడ్చింది.”

“డబ్బిగాడు నటసమ్రాట్. మీ అమ్మ కీ.శే. కన్నాంబలాంటి మహానటి” అన్నాను నేను. మాటా మాటా పెరిగింది. చినికి చినికి గాలివానైంది.

“ఇంక మీరు ఆ ఇంట్లో అడుగుపెట్టొద్దు. మా అమ్మని కాని, మా తమ్ముడిని కాని డబ్బు గురించి ఒక్కమాట అడిగితే నేను చచ్చినంత ఒట్టు...”

“డబ్బిగాడు, నువ్వు, మీ అమ్మ... అందరూ గంగలో దూకండి. ఇంక ఈ విషయంలో నేను నోరెత్తితే వెంకటేశ్వరస్వామి మీద ఒట్టే” అని మా కులదైవం మీద నేను ఒట్టేసి ప్రతిజ్ఞ చేసాను.

ఈ సంఘటన జరిగి ఇప్పటికి ఏడాదిన్నర అయింది. నెలకోసారి మా ఆవిడ డబ్బిగాడింటికి వెళ్లివస్తోంది. ఇప్పటికి పాతికవేలు మాత్రమే తీసుకురాగలిగింది. మా అత్తగారు ఇంత వరకూ ఇల్లు అమ్మి అప్పు కట్టే ప్రయత్నమూ చెయ్యలేదు. శ్మశానం పక్కన చాపా వెయ్యలేదు.

మా ఆవిడ తనేం మాట్లాడిందో, వాళ్లేమన్నారో సాధారణంగా ఏవీ చెప్పదు. నేనూ అడగను. మరీ విసుగెత్తినప్పుడు “ఈ వెధవకి పెళ్లాం ఎంత చెబితే అంత. మా అమ్మ సరేసరి పిచ్చిది” అంటూ మరదలను తిట్టిపోస్తుంది, తమ్ముడు, తల్లి అమాయకులయినట్లు.

నాకు కోపం వచ్చి బుర్ర బద్దలు కొడతానని ఎగురుతానేమోనని, 'ఎవరి పాపాన వాళ్లు పోతారు, మీరు మాత్రం బిపి తెచ్చుకుని ఆరోగ్యం పాడుచేసుకోకండి' అంటూ నాకు సలహా ఇచ్చి, 'నా మూడ్ బాగాలేదు. ఏదైనా సినిమాకు వెడదాం' అంది ఓ రోజు తమ్ముడి ఇంటినుంచి తిరిగి వచ్చిన తరువాత.

మా ఆవిడ సినిమాలో లీనమై చూస్తోంది. తెరమీద తిట్టుకుంటున్నారు. కొట్టుకుంటున్నారు. పాడుతున్నారు. గంతులేస్తున్నారు. నేను నిరాసక్తంగా చూస్తున్నాను.

ఇంతలో ఓ సీను వచ్చింది. తెరమీద హీరో అనుకుంటా– రివాల్వరు విలన్‌కేసి గురిపెట్టాడు. విలన్ నన్ను వదిలేసేయ్, అని బతిమాలుతున్నాడు. హీరో విలన్‌గాడికి వాడు చేసిన పాపాలన్నీ ఒక్కొక్కటీ గుర్తు చేస్తూ, ఒక్కొక్క బుల్లెట్ రెండు కాళ్ళు, రెండు చేతుల్లోకి పేల్చాడు. ఆఖరున పెద్ద లెక్చరిచ్చి, విలన్ గుండెల్లోకి సూటిగా పేల్చాడు.

ఆ సీను చూస్తున్న నా బుర్రలో బ్రహ్మాండమైన సీను రడీ అయిపోయింది. అందులో నేను హీరో, డబ్బిగాడు విలన్.

'బావా – ఇక్కడికెందుకు పిలిచావు?' అన్నాడు డబ్బిగాడు ఆశ్చర్యంగా చుట్టూ చూస్తూ. కొండలు, లోయలు – నిర్మానుష్యమైన ప్రదేశం.

డబ్బిగాడి ప్రశ్నకు సమాధానంగా నేను బొడ్లోంచి రివాల్వరు తీశాను.

"దీపావళి ఇంకా రెండు నెలలుంది బావా – అయినా ఈ వయసులో చిన్న పిల్లాడిలా బొమ్మ తుపాకీతో ఆటలేవిటి?"

"బొమ్మ తుపాకి కాదు గాడిదా – ఇది నిజం తుపాకీ" అంటూ గాలిలోకి పేల్చాను.

"అరే– ఇది నిజంగా నిజం తుపాకీయే – ఇది నీకెందుకు?"

"సమాజంలోంచి ఓ చీడపురుగుని, ఓ ప్రజాద్రోహిని, ఓ ఘరానా దొంగని, ఓ నరరూప నక్కని...." సినిమాలో హీరో డైలాగులు గుర్తు తెచ్చుకుంటూ అన్నాను – '... ఏరిపారెయ్యాలిరా'.

"ముసలి అమితాబ్ బచ్చన్‌లా డైలాగులు బాగానే చెప్పావు కాని నీ పర్సనాలిటీకి ఈ డైలాగులు నప్పడం లేదు బావా – ఇంతకీ ఎవడా నరరూప నక్క.."

'టి.కె. రాఘవరావు – కన్నాంబగార్ల ఏకైక పుత్రుడు, శారదగారి ఏకైక సహోదరుడు. కోటేశ్వరరావుగారి ఏకైక బావమరిది – డబ్బిగాడని పిలపబడే రామకృష్ణ.'

"నేనా? నేనెవరికి ఎప్పుడు అన్యాయం చేశాను" చాలా అమాయకంగా మొహం పెట్టాడు – "ఒకవేళ నేరం చేసుంటే పోలీసులు కేసు పెట్టాలి, కోర్టులు శిక్షించాలి..."

"డబ్బీ– ఘరానా దొంగలని పోలీసులు, కోర్టులు ఏం చెయ్యవు – ఇక్కడ నేనే పోలీసుని– నేనే చట్టాన్ని – నేనే కోర్టుని – నేనే జడ్జిని – నీకు మరణశిక్ష అమలు జరిపేదీ నేనే..." అంటూ వాడి కుడికాలి మీద పేల్చాను.

"అయ్యబాబోయ్ – ఇంత వరకూ బావామరుదుల సరసం అనుకుంటున్నాను– నిజంగా చంపేస్తావా బావా?" అంటూ ఏడుపు మొదలు పెట్టాడు డబ్బిగాడు.

"దౌటెందుకురా డబ్బీ?" రెండో గుండు ఎడం చెయ్యిలోకి పోయింది.

సినిమాలో విలన్లా డబ్బిగాడు కుంటుకుంటూ పరిగెట్టసాగాడు. నేను కుడిచెయ్యి, ఎడంకాలు మీద ఇంకో రెండు గుళ్ళు పేల్చాను. డబ్బిగాడు నేలకూలిపోయి, నా కాళ్ళు పట్టుకుని బతిమాలసాగాడు.

"డబ్బీ – ఆఖరిసారి ముసలి మాష్టారికి నువ్వు చేసిన ద్రోహం గుర్తుకు తెచ్చుకుని, దేవుడిని తలుచుకో..."

"దేవుణ్ణి తలుచుకుంటున్నాను కాని దాంట్లో గుళ్ళు అయిపోయాయి బావా..."

"ఇంకోటుంది కదా"

"ఒకటి గాలిలోకి పేల్చావా? రెండు కాళ్ళు, రెండు చేతులు – మొత్తం ఆరు గుళ్ళూ అయిపోయాయి – అంటే దేవుడికి కూడా నా కాళ్ళు చేతులూ, తీసెయ్యడమే కాని నేను చావడం ఇష్టం లేదన్నమాట...." అంటూ లేచి, కుంటుకుంటూ డబ్బిగాడు పారిపోతుంటే...

"ఏవిటలా పరవశత్వంతో చూస్తున్నారు?" అంటూ మా ఆవిడ ఎవరూ చూడకుండా గట్టిగా ఓ గుద్దుగుద్ది వాస్తవ ప్రపంచంలోకి తీసుకువచ్చింది.

స్టంటు సీను అయిపోయినట్లుంది – తెరమీద ఓ సుందరి రొమ్ములకి ఒక సిల్కు జేబు రుమాలు, నడుం దగ్గర ఇంకో సిల్కు జేబు రుమాలు కట్టుకుని గంతులేస్తూ కనిపించింది. డబ్బిగాడిని మర్డరు చెయ్యలేకపోయినా, కనీసం వాడి కాళ్ళూ చేతులూ తీసెయ్యగలిగినందుకు ఆనందిస్తూ సీన్ రీక్యాప్ మళ్ళీ చూస్తుంటే ఇంకో గుండు రివాల్వరులో మిగిలే ఉందన్న సంగతి తెలిసింది. కాళ్ళూ చేతులూ గాలిలోకి ఓ గుండు – అయిదే కదా అవుతాయి!

"డబ్బిగాడు దొంగలెక్క చెప్పి పారిపోయాడు - మళ్ళీ దొరక్కపోడు" అన్నాను సినిమా హాలు లోంచి బయటకు వస్తుంటే.

"ఆ విషయం ఎత్తనని వెంకటేశ్వరస్వామి మీద ఒట్టేశారు కదా' అంది మా ఆవిడ.

'ఆ విషయం కాదు - ఇది ఇంకో విషయం' అన్నాను విషయం ఏమిటో చెప్పకుండా. మా ఆవిడకి నేనన్నది అర్థంకాలేదనుకుంటా - నన్ను పిచ్చోడిని చూసినట్లు చూసి నిట్టూర్చింది.

నెల తిరగగానే, ఒకటవ తారీఖున మా ఆవిడ అలవాటుగా తమ్ముడింటికి వెళ్ళింది. డబ్బిగాడు ముంబాయి వెళ్ళాడుట. మా అత్తగారు అలవాటుగా, 'వాడు చాలా కష్టాల్లో ఉన్నాడే తల్లీ' అంటూ కన్నీళ్ళు పెట్టుకుంది. డబ్బిగాడి పెళ్ళాం, 'వదినగారూ... మీ తమ్ముడు గారు నా పుట్టిన రోజుకి ఈ వజ్రాల దుద్దులు ప్రెజంటు చేశారు' అంటూ వజ్రాల దుద్దులు చూపించిందట. దీపావళికి మీ అమ్మగారికి చంద్రహారాలు చేయించారంటూ చంద్రహారాలు చూపించిందట.

"దివాలా తీసినవాళ్ళు వజ్రాల దుద్దులు, చంద్రహారాలు చేయించుకుంటారా? పైగా సిగ్గులేకుండా నాకు చూపిస్తుందా? ఎంత గుండెలు తీసిన బంటో..." అంటూ ఓ అరగంట చిందులు తొక్కి, 'ఎవరి పాపాన వాళ్ళు పోతారు- మీరు మాత్రం బిపి పెంచుకుని ఆరోగ్యం పాడుచేసుకోకండి.' అంటూ రొటీన్ సలహా ఇచ్చింది మా ఆవిడ.

మా ఆవిడ చెప్పింది వినగానే నా బిపి ఒక్కసారి ఝుమ్మని లేచింది. వెళ్ళి డబ్బిగాడి కొంపకు అగ్గిపెట్టేద్దావా అని అరక్షణం అనిపించింది. కానీ నా బిపి ఎంతోకాలం హైలో ఉండదు. రెండు మూడు క్షణాల్లో నార్మలుకి వచ్చేస్తుంది. దానికో చిట్కా కనిపెట్టాను నేను...

భోజనమయ్యాక, గుమ్మం ముందు కానుగ చెట్టుకింద పడక కుర్చీలో పడుకుని చుట్ట ముట్టించి పొగ మేఘాలు వదులుతూ, 'ఒరే డబ్బీ' అని పిలిచాను -

డబ్బిగాడూ, నేను సముద్రం గట్టున నడుస్తున్నాం- '... ఇక్కడ స్నానం చేస్తే ఎల్లా ఉంటుందిరా?'

"ఇచ్చట లోతు ఎక్కువ - సముద్రములో దిగుట ప్రమాదము అన్న బోర్డు చూడలేదా? ఇక్కడొద్దు - ఇంకోచోట దిగు..."

"నేను కాదు గాడిదా - దిగేది నువ్వు".

"నాకు ఈత రాదు కదా".

"అందుకే కదా దిగమంటున్నది" అంటూ రివాల్వరు తీశాను.

"ఒరే డబ్బీ- ఓ చిన్న ఉత్తరం పోలీసులకి రాయి" అంటూ కలం, కాగితం ఇచ్చి డిక్టేట్ చేశాను - 'నేను నా తుచ్ఛమైన జీవితంతో విసుగెత్తిపోయాను. దేవుడిలాంటి మా బావను మోసం చేశాను. ప్రాయశ్చిత్తంగా నేను సముద్రంలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాను. నా చావుకి ఎవ్వరూ భాధ్యులు కాదు- మా బావ అసలే కాదు'.

"ఇంకా ఆత్మహత్య చేసుకోకుండా ఆత్మహత్య చేసుకున్నాను అని రాయడమేమిటి? ఇలా రాస్తే గ్యారంటీగా పోలీసులు నిన్ను తీసుకుపోతారు బావా".

"అయితే ఉత్తరం వద్దులే- అలాగే దూకు" అంటూ వాడి కాళ్ళ ముందు ఓ గుండు పేల్చాను. వాడు రెండడుగులు వెనక్కు గెంతాడు. నాలుగో గుండు పేలేటప్పటికి వాడు పీకలోతు నీళ్ళలో ఉన్నాడు. ఇంకా వెనక్కు వెళ్ళరా డబ్బీగా అంటూ అయిదో గుండు పేల్చాను. డబ్బిగాడు ఇంకో అడుగు వెనక్కు వేసి, 'బావోయ్ - మునిగి చచ్చిపోతున్నాను' అంటూ మునుగుతూ తేలుతూ గోలపెడుతుంటే....

"ప్రసన్న ఇందాకట్నుంచీ శారదగారూ, శారదగారూ అంటూ అలా పిలుస్తుంటే బెల్లం కొట్టిన రాయిలా ఉలుకూ పలుకూ లేకుండా అలా చూస్తారేవిటి?" - ఖంగుమంటూ మా ఆవిడ గొంతు వినిపించగానే తెలివొచ్చింది. ఎదురుగా పక్కింటి ప్రసన్న ఇబ్బందిగా కదులుతూ కనిపించింది. ప్రసన్న ఏదో అడిగింది. మా ఆవిడ ఏదో చెప్పింది. ప్రసన్న వెనక్కి తిరిగి నాకేసి చూస్తూ తడబడుతూ వెళ్ళిపోయింది. ఆవిడ వెళ్ళిపోయిన తర్వాత మా ఆవిడ ఆకాశమెత్తు లేచింది.

"ఈ వయసులో ఇల్లా తయారవుతున్నారేమిటి? ఎప్పుడూ ఆడదాని మొహం చూడనట్లు, అలా నోరు తెరుచుకుని పరవశత్వంతో చూస్తుంటే ప్రసన్న ఏమన్నా అనుకుంటుందేమోనన్న జ్ఞానమైనా లేకుండా పోయింది మీకు- మొన్న మటుకు మొన్న సినిమా హాల్లో....హవ్వ..."

నేను డబ్బిగాడిని మర్డరు చేసే ప్రోగ్రాంలో బిజీగా ఉండి ప్రసన్నను గమనించ లేదని మా ఆవిడకి చెప్పలేక మౌనం వహించాను. ఆవిడ లోపలకు వెళ్ళిపోయిన తర్వాత, మళ్ళీ సీనులోకి వెళ్ళి డబ్బిగాడు మునుగుతూ, తేలుతూ గొల్లుగొల్లుమంటుంటే

ఒడ్డు మీద నిలబడి తాపీగా చుట్టకాలుస్తూ చూసి ఆనందించాలనుకున్నాను కానీ లింకు తెగిపోయింది. అందుకని మళ్ళీ కొత్త సీను మొదలు పెట్టాను...

"ఒరే డబ్బీ"

"ఏంటి బావా - ఇంత అర్ధరాత్రి వేళ వచ్చావు"

"గొప్ప గొప్ప పనులన్నీ అర్ధరాత్రి వేళ జరుగుతాయిరా - పద నీతో కొంచెం పనుంది"...

సీను పూర్తయి, డబ్బిగాడు ఈ లోకం నుంచి నిష్క్రమించేటప్పటికి బి.పి. నార్మలుకి వచ్చేస్తుంది - గేరంటీగా 120/80... డౌటుంటే చూసుకోండి...

*(నవ్య మాసపత్రిక, నవంబర్ 21, 2007)*